# తొలివిచ్చిన తెలిమబ్బులు




సాయంత్రం అయిదుగంట లయింది...

వరండాలో పేముకుర్చీలో కూర్చుని స్వెట్టరు అల్లుతూన్న కృష్ణవేణి 'పోస్ట్' అన్నకేక వినబడి త్రుళ్ళిపడి లేచింది.

వీధిలోనికి వచ్చి పోస్ట్‌మాన్ యిచ్చిన కవరు తీసికొని ఎడ్రస్ చూసింది ... ఆ కవరుమీద తన ఎడ్రసేవుంది ... వ్రాత కూడా పరిచయ మయినట్లుగానేవుంది... కవరు రెండోవైపు త్రిప్పి, ఫ్రం అడ్రస్ కోసం చూసేసరికి ఊరూపేరూ లేకుండా అక్కడ అడ్డంగా ఒక గీతమాత్రం గీసి వుంది...

'సరే! చూద్దాం' అనుకుంటూ తిరిగి కుర్చీ దగ్గరకువచ్చి అల్లుతూన్న స్వెట్టరూ, సూదులూ ప్రక్కనే క్రింద పెట్టి, కవరువిప్పి చూసింది...ఉత్తరం లోని మొదటి సంబోధనే ఆశ్చర్యం కలిగించింది...

'డియర్ వేణూ' అని వుంది... ఉత్తరం ఎవరువ్రాశారో ఈ సారి కృష్ణవేణికి అవగతమయి పోయింది ... తిరిగి చదవడం ప్రారంభించింది ... 'డియర్ వేణూ,

చాలా రోజుల నుండి నీకు ఉత్తరం వ్రాద్దామనుకుంటున్నాను గానీ వ్రాయలేక పోయిన నా అశ్రద్ధకు క్షంతవ్యుణ్ణి.'

నేనిప్పుడు భిలాయ్‌లో వుంటున్నాను... ఉద్యోగం మంచిదయినా అయినవాళ్ళం దరినీ విడిచిపెట్టి యింత దూరంలో ఉండటం బాధగానే వుంది......అయినా తప్పదుగదా ! డ్యూటీలో ఉన్నంతసేపూ తప్ప మిగతా వేళల్లో ఒంటరిగా ఆలోచిస్తూ కూర్చుంటే గత స్మృతులు కదిలి లీలా మాత్రంగా మనస్సు, బాధా, సంతోషమూ కాని విచిత్రమయిన అనుభూతిని పొందుతున్నది...ముఖ్యంగా నీవు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా మధురమయిన ఊహాలతో నా మనసు నిండిపోతుంది. వచ్చి చూద్దామంటే శలవు దొరకడం లేదు... నిన్ను చూచి ఎన్నాళ్లో గాక పోయినా ఎన్నో యుగాలు దొర్లిపోయినట్లుంది వేణూ...

వేణూ ! నీకో శుభవార్త తెలియ

కేదామని ఉత్తరం ప్రారంభించి ఇంత ఉపోద్ఘాతం వ్రాశాను ... ఇన్నాళ్ళ కిన్నాళ్ళకు నాకు శెలవు మంజూరయింది... నాలుగైదు రోజుల్లో బయలుదేరి వద్దామనుకుంటున్నాను...రాగానే నేను చెప్పదలచుకున్న శుభవార్త ప్రత్యక్షంగా తెలియజేస్తాను...నేను వచ్చేలోగా ఆ శుభవార్త ఏమయి వుంటుందా అని ఆలోచిస్తూ ఉండు...

ఉంటాను మరి
నీ
శ్రీధర్.

ఉత్తరం చదవడం పూర్తి చేసిన ఆమె గుండెలు వేగంగా కొట్టుకోవడం ప్రారంభించాయి...అర్థం గాని ఆవేశంతో ఒక విధమైన భయంతో ఆమె మనస్సంతా అల్లకల్లోల మయింది...

'ఏమిటిది ? ఏం జరగబోతూంది ? రావు...శ్రీధర్‌రావు...తన బావ... ఇప్పుడు రావడమా? అందునా తనను చూడ్డానికి? అతను వస్తే ఎలాగ ? తన భర్తకి ఏమని చెప్పడం ?

రావుకి తన పెళ్ళి గురించి అసలు తెలియనే తెలియదు...అనివార్య పరిస్థితులలో అనుకోకుండా తన వివాహం జరిగిపోయింది. అతి స్వల్ప వ్యవధిలో ముహూర్తం నిశ్చయింప బడటం వలన బంధువులందరికీ సమయానికి వర్తమానాలు కూడా పంపడం జరగలేదు ... ఆ కారణం వల్లనే ఎక్కడో భిలాయ్‌లో వుంటున్న శ్రీధర్‌రావుకి తెలియపర్చడం జరగలేదు. అదీగాక పోయినా యింకా చెప్పవలసివస్తే తర్వాతనయినా రావుకు తెలియపర్చక పోవడానికి కావలసినంత కారణం వుంది...

శుభవార్త చెప్పడానికి పనిగట్టుకు వస్తున్నట్టు ఉత్తరం వ్రాశాడు...కొంప దీసి తనమీద ఆశతో కాదుగదా!

కృష్ణవేణి ముఖం నిండా స్వేద బిందువులు ఆవరించాయి. పైట చెంగుతో ఒత్తుకుంది. ఈ ఆలోచన బలీయమైన కొద్దీ ఆమె హృదయచలనం ఆగిపోతున్నట్లు అనిపించింది.

అవును! ఆ ఆశతోనే! ఆ ఆశతోనే వస్తున్నాడు ··· లేకపోతే తన కెందుకు ఉత్తరం వ్రాస్తాడు?

నాలుగుసంవత్సరాలక్రితం తండ్రి రావుతో వివాహ ప్రసక్తిని తెస్తే అతడు తనకు యిష్టమేగానీ యిప్పుడిప్పుడే చేసుకోననీ, ఆలోచించి తర్వాత చెప్తాననీ ఉద్యోగాన్వేషణలో వెళ్ళిపోయినవాడు ఎక్కడున్నాడో ఏం చేస్తున్నాడో కూడా ఇప్పటి ఉత్తరం వచ్చేవరకు ఎవరికీ తెలియదు...ఇప్పుడు భిలాయ్‌లో వుంటున్నట్టు వ్రాశాడు ... ఇంజనీరుగా మరి!... ఆగిపోయిన యంత్రాన్ని బాగుచేసినట్టు మరిచిపోయిన మనస్సును తిరిగి పునస్మృతి చేసుకున్నాడు కాబోలు...

చిరకాలంగా అతనిని గురించి వివరాలు తెలియకపోవడంతో తన తండ్రి అతనికి తన నిచ్చి పెళ్ళి చేయాలన్న ఆశ దూరం చేసుకున్నాడు...అప్పటికే యిద్దరి కూతుళ్ళకు పెళ్ళిళ్ళుచేసి, వాళ్ళ కాపురాలు సరిదిద్దలేని తండ్రి, శ్రీధర్ ఆశ దూరం కావడంతో వేరే ప్రయత్నాన్ని గురించి తొందర పడదల్చుకోలేదు.

విజ్ఞానంకోసం, కాలక్షేపంకోసం చదువుకున్న చదువు, కాలాన్ని వృధా చేయకుండా, పెళ్ళి అయేవరకూ గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోకుండా ఉద్యోగాన్వేషణకు దోహదమిచ్చి, తండ్రికి తోడు కాస్త ఉపాధికికూడా మార్గమయింది...

ఒక ఆదివారం తన సహోద్యోగిని రాధతో కలిసి మెజస్టిక్ థియేటర్‌లో మ్యాట్నీ షోకి వెళ్ళింది...ఇంటర్వెల్‌లో తన చిన్ననాటి స్నేహితురాలు లత, వాళ్ళన్నయ్య కనుపించారు ... చాలా రోజులకు కలుసుకోవడంతో పిక్చర్ పూర్తయ్యేవరకూ మాట్లాడుకుంటూనే ఉండిపోయారు. లత నాన్నగారికి ప్రమోషన్ వచ్చింది. ఈ మధ్యనే నెల్లూరునుండి యిక్కడకు బదిలీ చేశారట...అందరం యిక్కడనే వుంటున్నామనీ చెప్పి, తన యింటి అడ్రస్ చెప్పి మరీ మరీ ఒకసారి తనను రమ్మని ఆహ్వానించారు లత, వాళ్ళన్నయ్య కూడా...

ఆ మరుసటి ఆదివారం తాను వాళ్ళింటికి వెళ్ళింది...అన్న ప్రకారం తాను వచ్చినందుకు లత యింట్లో వాళ్ళందరూ ఎంతో సంతోషించారు.. లత సరేసరి...తాను వచ్చానన్న సంతోషంతో యింట్లో అందరినీ పరిచయంచేస్తూ, యిల్లంతా కలియతిరుగుతూ 'కాఫీ కావాలా? కూల్ డ్రింక్ కావాలా ?' అని యక్షప్రశ్నలువేయసాగింది. నిజమయిన స్నేహంలో ఉన్న ఆప్యాయత అటువంటిది...ఆ వాత్సల్యం హృదయానికి సంబంధించినది...దానికి భాషలేదు...ఆ భావనతోనే స్నేహితురాలి అనురాగాన్ని చూసి తన హృదయం మూగపోయింది...

తిరిగి ఏర్పడిన పరిచయంతో రాకపోకలు ప్రారంభం అయ్యాయి. ఒకటి రెండు సార్లు లతతోబాటు వాళ్ళన్నయ్యకూడా వచ్చాడు... పేరు మోహన్. పరిచయం మరింత అధికమైన తర్వాత ఏర్పడిన చనువును పురస్కరించుకొని మోహన్ ఒక్కడే రెండు మూడుసార్లు వచ్చాడు... ఎప్పుడు వచ్చినా వాళ్ళచెల్లెలు లత చూసి రమ్మనమన్నదనో, ఏవేనా పుస్తకాలు ఇమ్మన మన్నదనో చెప్పి వెంటనే వెళ్ళిపోయేవాడు...

ఆవేళ శనివారం! తనకి బాగాగుర్తు!

లత వాళ్ళ నౌకరు కుర్రాడువచ్చి 'మిమ్మల్ని అమ్మాయిగారు అర్జంటుగా రమ్మని చెప్పారండి' అని చెప్పాడు...

'ఎందుకు?' అంది...

'నాకు తెలియదండి' అని వెళ్ళిపోయాడు.

అప్పటికే సాయంత్రం ఆరు గంటలు కావస్తున్నది...బహుశా పిక్చర్‌కై వుంటుందని అనుకొని, తల్లితో లత యింటికి వెళ్తున్నట్టు చెప్పి, బయలుదేరింది. బస్ స్టాప్‌కొచ్చి పదినిమిషాలు వెయిట్‌చేసినా వచ్చేసూచనలు కనుపించక పోవడంతో రిక్షాను పిలిచింది...

తాను వెళ్ళేసరికి లత వాళ్ళయిల్లంతా నిశ్శబ్దంగా, ప్రశాంతంగావుంది ఆసమయంలో. లోపల రేడియోనుండి లలిత సంగీతం మెల్లగా వినబడుతున్నది... లత శ్రద్ధగా పెంచిన మొక్కలు చిరుగాలి తరంగాలకు తలలాడిస్తూ తనను ఆహ్వానిస్తున్నట్లున్నాయి...గేటుతీసి లోనికి కాలు బెడుతూంటే తన ఎడమకన్ను అదిరినట్లయింది... కించిత్కాలం నిలబడిపోయి, అన్యమనస్కంగా లోనికి అడుగుబెట్టింది...

హాలులో రెమింగ్‌టన్ టైపురైటర్ ముందు కూర్చుని టైపుచేస్తూ మోహన్ ఒక్కడే కనుపించాడు ... తటపటాయిస్తూ నిలబడివున్న తనను చూసి, 'ప్లీజ్, ఒక ఐదు నిమిషాలు కూర్చోండి...మీతో మాట్లాడుదామని నేనే కబురుపంపించాను ... యింట్లో ఎవరూ లేరు ... అందరూ పిక్చర్‌కెళ్ళారు'

అన్నాడు తన కళ్లలోకి అదోలా చూస్తూ...

తనకు అంత ప్రత్యేకంగా పిలిపించి మాట్లాడవలసిన రాచకార్యమేమిటూ అని ఆలోచిస్తూ, అతని అభ్యర్థన తిరస్కరించడం సభ్యతకాదని భావించి అక్కడేవున్న సోఫాలో కూర్చుంది ఊపిరి బిగపట్టి...

వాళ్ల నాన్నగారి ఉద్యోగం గూర్చి, లత పెళ్లి గూర్చి, వరకట్నని షేధాల్ని గురించి అనర్గళంగా ఉపన్యసించిన అతడు చివరకు తన అభిప్రాయాన్ని వెల్లడించాడు... చెబుతున్నది వినడం తప్పితే ఆసమయంలో తన మెదడు ఎందుకూ పనిచేయకుండా మొద్దుబారిపోయింది...

'లతా, మీరూ కలసి చదువుకొనే రోజుల లోనే మీరు నన్ను ఆకర్షించారు. కానీ మీకు మేనరికంవంటి దగ్గరసంబంధం ఏమయినా ఉందేమోనని భావించాను...మేము నెల్లూరు వెళ్లిపోవడంతో మీగురించి వివరాలు తెలిసిరాలేదు... మొన్న థియేటర్‌లో కలిసినతర్వాత లత చెప్పింది మీకింకా వివాహం కాలేదని... తిరిగి నా ఆశలు చిగురించాయి... మీరు నేనేదో కాకతాళీయంగా చెబుతున్నట్లు భావించక నిదానంగా ఆలోచించి మరీ మీ అభిప్రాయం చెప్పండి' అని ముగించాడు...

ఆలోచనల బరువుతో తాను యింటికి వచ్చేసింది...

ఇన్నాళ్లుగా అతను తనతో పెంచుకున్న పరిచయానికీ, అతని నిండయిన కళ్లలోని కాంతికీ ఈనాడు అర్థం తెలిసివచ్చింది... ఒక్కొక్కళ్ల మనస్తత్వమే అంతటిది... మనస్సులోని మమతను మభ్యపరచుకొని, పైకి అమాయకుల్లా కనుపిస్తారు... సమయంవస్తే వాళ్లంతటి సాహసికులు మరి వుండరు. ఎదుటివాళ్ల మనస్తత్వాన్ని అర్థం చేసుకోలేని తన అమాయకత్వానికి నవ్వు వచ్చింది... నవ్వుతూ, తుళ్లుతూ, స్నేహితురాండ్రతో కలిసి తిరగడం, బోళాగా మాట్లాడటం తప్పితే. యింతటి లోతయిన ఆలోచనలు తనకురావు... తెగని ఆలోచన బహు పెద్దది... సమస్య పరిష్కార మయేవరకూ మనసును వేధించి చంపుతుంది ... ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాతగాని సంతృప్తి వుండదు. అదేజరిగింది... చదువు, సభ్యత, అందం అన్నీ వున్నవ్యక్తి మోహన్... అతని పరిచయంవల్లకానీ, మాటలవలనగానీ తన

# తొలివిచ్చిన...

కేటువంటి అవిశ్వాసమూ కలగలేదు... ఏనాడో జరగవలసిన నిర్ణయం... ఒకనాటి కయినా జరగవలసినది... ఈనాడొక అవకాశం ఏర్పడింది... ఎవరి భవితవ్యానికి వాళ్ళు స్వతంత్రించి, మంచిబాటవేసుకుంటూంటే సహృదయులెవరూ కాదనలేరు. తాను ముందుగా తన నిర్ణయాన్ని లతతో చెప్పింది... లత వాళ్లతల్లిదండ్రులతో చెప్పింది... రాయబారాలు పంపించారు... సంబంధం ఖాయమయింది... ముహూర్తం నిర్ణయించుకొని తాంబూలాలు పుచ్చుకున్నారు... నిర్ణయించుకున్న వారం తిరగకుండానే వైభవోపేతంగా వివాహం జరిగిపోయింది...

అనురాగం మనస్సుకు చెందినది... అటువంటి రెండు మనస్సులు ఏకమై తోడు నీడగా దాంపత్యాన్ని సాగిస్తూంటే ఆసంసారం స్వర్గతుల్యమౌతుంది... నవవికసిత కుసుమ పరిమళమూ, ప్రకృతి అందమూ, పాపాయి చిరునవ్వు, చల్లని వెన్నెలా, నిష్కల్మషమయిన ప్రేమా యివన్నీ ఒక కోవకు చెందినవే...

మోహన్ సాహచర్యంలో తన మనస్సు అనవరతమూ ఆహ్లాదాన్ని పొందగలుగుతూన్నది...

నిండెడు పాలలో ఒక ఉప్పురాయిచాలు... పాలు విరిగిపోతాయి... నిర్మలంగాఉన్న కాసారంలో ఒక్కరాయి విసిరితేచాలు నీళ్లన్నీ చెదిరిపోతాయి ... వండువంటి నిండు




సంసారంలో ఒక్కసారి కలత రేగితేచాలు... ఆ కలత శాశ్వతంగా నిలిచిపోతుంది...

'ఏమిటి చెయ్యడం? తన కొక బావ వున్నాడని, అందులోనూ తనను వివాహం చేసుకోవడానికి ఎదురు చూస్తున్నాడని ఎప్పుడూ చెప్పలేదు...

తను మాత్రం ఏం చెబుతుంది? ఎవరితోనూ చెప్పనూ చెయ్యకుండా వెళ్లిపోయిన వాడు మళ్లీ తిరిగివచ్చి తననే వివాహం చేసుకుంటాడన్న నమ్మక మేమిటి? ఇంతకీ ఏదో మేనరికం గదా? అని తల్లిదండ్రులకు అభిమానమున్నా, వివాహవిషయంలో తర్వాత చెప్తానని అప్పటికి విముఖత్వం ప్రదర్శించిన శ్రీధర్ గురించి ఎవరూ అంతగా ఆలోచించలేకపోయారు. కళ్యాణయోగం వస్తే ఆగదంటారు పెద్దలు...అదే జరిగింది... మోహన్ అంటే తనకు సదభిప్రాయం ఏర్పడడమూ, ఆ అభిప్రాయం ఒక కార్యరూపాన్ని దాల్చడమూ జరిగిపోయిన యిన్నాళ్లకు ఏదో విపత్తు సంభవిస్తున్నట్లు మనస్సు కీడు శంకిస్తున్నది...

శ్రీధర్‌కి తన ఎడ్రస్ తెలియడం గూడా ఆశ్చర్యంగా వుంది...ఎవరో చెప్పి ఉంటారు.. ఎవరయి వుంటారు చెప్మా అన్న విషయం కూడా ఆలోచనలో పడింది...తనను యింకా అవివాహితగానే వూహిస్తున్న శ్రీధర్ వస్తే ఎలా మాట్లాడుతాడో? ఎలా ప్రవర్తిస్తాడో?

గంపెడు ఆశతో, కోటి కోర్కెలతో తనకోసం, తనను వివాహం చేసుకోదలచి హఠాత్తుగా వస్తున్న అతడు, తనకు తెలియకుండా వివాహం చేసుకున్నందుకు, తనను వివాహం చేసుకోలేదన్న కక్ష కొద్దీ పగ బట్టడు గదా?

ఈ ఆలోచన రాగానే వేణా గుండె ఝల్లుమంది...నీలాంబర పథంలో, క్షణ క్షణానికి క్రమ్ముకుంటున్న కారు మబ్బుల్లా మనస్సు కలుషితమయి, ఆలోచనలు క్రమ్ముకోసాగాయి.

వర్షాగమన సూచకంగా తూర్పుదిశను తళుక్కున విద్యుల్లతలా మెరుపు మెరిసి శబ్దం చేస్తున్న ఉరుముల ధ్వనిలా, హృదయంలో సుడిగుండంలా తిరుగుతూన్న ఆలోచనలనుండి, చాలాసేపటికిగానీ కృష్ణవేణి తేరుకోలేకపోయింది...

టైము చూస్తే సుమారు ఏడున్నర గంటలయింది ... అర్థంకాని ఆలోచనలతో సుమారు మూడుగంటలకాలం వృథా చేసినందుకు కృష్ణవేణి ఎంతగానో నొచ్చుకొంది... మోహన్ వచ్చేటైం కావడంతో, కంగారుగా లేచి, వంట ప్రయత్నం చేయసాగింది...వంటపనంత పూర్తయేసరికి రాత్రి తొమ్మిదిగంటలయింది...

ఆలోచించడం మానేసి మనసు నిరాభారం చేసుకోవాలని భావించి, గదిలోకొచ్చి రేడియో ఆన్ చేసింది...ఏదో నాటిక కాబోలు అప్పుడే ప్రారంభమయింది...తను వినేటప్పటికి భార్యాభర్తలు కాబోలు కీచులాడుకుంటున్నారు ... పచ్చని సంసారంలో చిచ్చు చెలరేగినట్లుంది...కృష్ణవేణికి భయం వేసి స్విచ్ ఆఫ్ చేసివేసింది ... టేబుల్ మీద మధ్యాహ్నమే వచ్చిన వీక్లీ కంట బడగానే అందుకొని, పేజీలు తిరగవేస్తూ ప్రముఖ రచయిత్రి ఒకామె వ్రాసిన కథ కంటబడగానే ఆసక్తితో చదవడం ప్రారంభించింది ... అదీ ఒక కుటుంబగాథ... రేడియో నాటికలానే వుంది...భార్యా భర్తలిద్దరూ విద్యాధికులే...చిన్న సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునే విషయంలో చిలికి చిలికి గాలివానయినట్లు పెద్ద రగడ ప్రారంభమయింది...కథ చదవడం మానేసి, భయంగా కృష్ణవేణి పుస్తకం మూసేసింది. టేబుల్‌మీద రేడియో ప్రక్కనే వున్న ఫొటోపై దృష్టి పడింది...

అది తమ పెళ్లినాటి ఫొటో...

ప్రేమ నిండిన కనులతో: ప్రపంచంలో తనను తప్ప యింకేదీ కోరనట్లు తన వైపే చూస్తూ నిలబడి 'ఎప్పటికీ నువ్వు నాదానివే సుమా?' అన్నట్లున్న మోహన్‌ను చూస్తుంటే ఆలోచనలు తిరిగి రేకెత్తాయి... ...అన్న మాటను నిలబెట్టుకొనే తత్వం మోహన్‌ది ... తనను ఏ విషయంలోనూ ఎప్పుడూ దండించడంగానీ, కోపించడంగానీ ఎరుగని వ్యక్తి... నిరంతర దరహాసవదనంతో. తనను నవ్విస్తూ, కష్టాలను మరిపించి మురిపిస్తూ వుండే మనస్తత్వంగల మనిషి ...తనకేదయినా అవసరం వస్తే కోరిందే తడవుగా తెచ్చియిచ్చేస్తాడు...

ఒకసారి తను అడిగిన ప్రశ్నకు, 'వేణూ! నీ కళ్లలో ఏదో మహత్తర శక్తి దాగి వున్నది ... లేకుంటే నా హృదయాన్ని

# తొలివిచ్చిన...

యింతగా అకట్టుకొని ఉండవు... చూడు ఆ కళ్లెంత అందంగా వున్నాయో' అంటే తను కిలకిల నవ్వింది...ఆ నవ్వుకు మోహన్ చిన్నబుచ్చుకున్నాడు గూడా ... అంతగా ప్రేమిస్తున్న మోహన్‌ను మోసగించడమా? ఛీ! ఛీ! ఇన్నాళ్లుగా రాని శ్రీధర్ యిప్పుడు మాత్రం ఎందుకు రావాలి? ఈ నాలుగు సంవత్సరాలలో తనేమయినదో, ఎలావున్నదో అనయినా ఆలోచించాడా? కనీసం తను ఎక్కడున్నాడో కూడా తెలియపర్చలేదే ... ఈలోగా తనకు వివాహం జరిగిపోయినదేమో నన్న ఆలోచన అతనికి ఎందుకు కలుగలేదు?

ఇన్నాళ్లకు వివాహం చేసుకునే ఉద్దేశ్యం కలిగిందా? తను గూడా అవివాహితగానే వుండిపోయిందనుకున్నాడా? అలా అని తను ఎప్పుడూ అతనితో చెప్పలేదే? ఆ మాట కొస్తే తను ఎన్నడూ శ్రీధర్‌ను ఖచ్చితంగా వివాహం చేసుకుంటానన్న భావాన్ని వ్యక్తపరచనేలేదు...ఈ విషయంలో శ్రీధర్‌ను తానేమీ మోసం చెయ్యలేదు...

ఆలోచనా ప్రవాహంలో ఈదులాడుతున్న కృష్ణవేణికి బయట తలుపు దబదబా బాదిన చప్పుడు చాలాసేపటికిగానీ వినిపించనేలేదు.. వినబడటంతో కంగారుగాలేచి వెళ్లి తలుపు తీసింది.

వర్షం గాకపోయినా చినుకులు పడటం వలన కొద్దిగా తడిసిన మోహన్ లోపలికి అడుగు పెట్టి భార్య ముఖంవంక చూసి విస్తుబోయాడు...వాడిపోయినట్లున్న ముఖంతో, రేగిన జుట్టుతో, క్రొత్త రూపంలో కనుపిస్తున్న కృష్ణవేణిని చూసి, వెంటనే కారణం తెలిసికొనడం దేనికి లెమ్మని లోనికి వెళ్లి డ్రెస్ మార్చుకుని, బాత్‌రూంకు వెళ్లి కాళ్లు చేతులూ కడుక్కొని టవల్‌తో ముఖం తుడుచుకుంటూ హాల్లోకి వచ్చాడు...

'ఏం దేవిగారు మాకేమయినా ప్రసాదం అనుగ్రహిస్తారా?' అన్నాడు చిలిపిగా ఇంకా బొమ్మలా తలుపుదగ్గరే నిలబడి వున్న కృష్ణవేణిని చూసి...

కృష్ణవేణి భర్తవంక సూటిగా చూడలేక, ఏదో నేరం చేసిన దానిలా తలవంచుకొని మెల్లిగా వంటగదిలోనికి వెళ్లింది, భర్తకు భోజనం వడ్డించే వేళంతా...కొసరి కొసరి వడ్డిస్తూ, తన మాటలతోనూ, నవ్వులతోనూ ప్రతిరోజూ ఉక్కిరి బిక్కిరి చేసే భార్య అలా ముభావంగా ఎందుకుందో మోహన్‌కు అర్థం కాలేదు. కారణం చెప్పించాలని శతధా ప్రయత్నించి విఫలుడయ్యాడు... అడిగిన ప్రతి విషయానికీ ఔను, కాదు, ఏం లేదు అని ముక్తసరిగానే జవాబు చెప్పి కాలం గడిపేసింది...

ఉరుములతోను, మెరుపులతోను రాత్రి ప్రారంభమయిన వాన తెల్లవారినా యింకా జల్లు పడుతూనే వుంది ... దానికి ఈదురు గాలి తోడయిందేమో వాతావరణమంతా చికాకుగానే వుంది...ఉదయమే లేచిన కృష్ణవేణి అన్యమనస్కంగానే పని చేయసాగింది... పనులన్నీ నాటంతట అవే మౌనంగా జరిగిపోతున్నాయి...ఆ మౌనానికి భాష, అర్థమూ వెతుక్కోవడంలో మోహన్ సతమతమయిపోతున్నాడు...

నిష్కర్షగా కారణం అడగడంవలన కలిగే పరిణామం మోహన్‌కు బాగా తెలుసు. వరిహాసానికయినా పరుషంగా మాట్లాడితే భార్య కళ్లల్లో నీళ్లు గిర్రున తిరుగుతాయి...అందుకే మోహన్ మౌనంగా ఉండిపోయాడు. తాను ఆఫీసుకు వెళ్లేవరకూ ఎంతో చలాకీగా తన పనులన్నీ త్వరత్వరగా చేసిపెట్టడం, సాయంత్రం తను వచ్చే వరకూ ఏమీతోచదని, పెందరాళే వచ్చేయమని, అమాయకంగా ముఖంపెట్టి అడగడం, సాయంత్రం ఎక్కడికి వెళ్లాలో రాత్రే నిర్ణయించేసి ముందుగా తనకు చెప్పకుండా కొంచెంసేపు ఉడికించడం చేసే వేణూ, వరధ్యానాన్ని చిత్తగిస్తూ, తను పిలిచినపుడల్లా ఉలిక్కిపడుతూ ఉంటే కావాలని రెండు సార్లు ఎగతాళి పట్టించాడు...అయినా ఆమె అదేమీ పట్టించుకోనట్లు భీతహరిణంలా చూస్తూ తనను తప్పుకొని తిరగసాగింది.

'ఏం వేణూ! వంట్లో బాగాలేదేమో! డాక్టరు దగ్గరకు వెళదామా' అంటే అక్కర్లేదని అడ్డంగా తలూపింది.

అర్థంకాని ఆమె వింత మనస్తత్వానికి కొంచెం అబ్బురపడుతూ, ఆఫీసు టైం కావడంతో డ్రెస్ చేసుకుని వెళ్లిపోయాడు.

సాయంత్రం క్లబ్బుకు వెళ్లకుండా పెందరాళే యింటికి తిరిగి వచ్చేశాడు... వేణూ ముఖంలో మార్పేమీ కనుపించలేదు

[illegible]
లేదు.

'ఏం వేణూ! ఎందుకలా వున్నావ్'? నాతో చెప్పడానికేం? నేను పరాయివాణ్నా?' అన్నాడు ఆమెను లాలిస్తూ దగ్గరకు తీసుకోబోతూ...

'ఏమీ లేదంటూ' తప్పించుకుంది. మోహన్ కించిత్కోపాన్ని గూడా అభినయం చేశాడు కానీ ఫలితం లేకపోయింది.

ఆ రాత్రి గూడా వానచినుకులు పడుతూనేవున్నాయి... అర్ధరాత్రి పీడ కల వచ్చి వేణూ కెవ్వుమని అరచి లేచి కూర్చుంది. 'ఏం జరిగింది వేణూ' అంటూ నిద్రనుండి లేచివచ్చి తన ప్రక్కనే కూర్చున్న మోహన్ హృదయానికి బల్లిలా హత్తుకుపోయింది. మోహన్ వేణూ ముఖాన్ని స్పృశించి చూశాడు...స్వేద బిందువులు ముఖాన్నిండా ఆవరించివున్నాయి...ఆమె పైట చెంగుతో ముఖాన్ని తుడిచి 'ఒంటరిగా పడుకోవద్దంటే విన్నావు కాదు' అని ఆమె చెయ్యి పట్టుకొని లేవదీసి, తన బెడ్ మీద కూర్చోబెట్టి, టేబుల్ ప్రక్క కూజాలో వున్న చల్లని నీళ్ళు తెచ్చియిస్తే గటగటా త్రాగేసింది.

'ఏం జరిగింది వేణూ' అంటే 'ఏం లేదంది.

ఆ స్థితిలో ప్రశ్నించడం యిష్టంలేక మోహన్ 'నిద్రపో వేణూ' అన్నాడు. కొద్ది క్షణాలలో గాఢంగా నిద్రాదేవి ఒడిలో వాలిపోయిన వేణు, మోహన్ ఆ రాత్రంతా మేల్కొనివుండడం గమనించనేలేదు.

తెలతెలవారుతూండగా వేణూకి మెలకువ వచ్చింది. ప్రక్కగదిలో ఏవో మాటలు వినబడుతూంటే కళ్ళు నులుముకుంటూ లేచివచ్చి కిటికీలోనుండి చూసింది.

గుండె ఝల్లుమంది. కనుపించిన దృశ్యాన్ని చూసి గిరుక్కున వెనక్కు తిరిగి చూసేసరికి మోహన్ బెడ్ మీద లేదు. ప్రక్క గదిలో మాటలతోబాటు నవ్వులు గూడా వినబడుతున్నాయి. వేణూ కాళ్ళు తడబడసాగాయి. వాళ్ళెవరో ఏమిటో తెలియడంలేదు. ఏం చేయాలో తోచడంలేదు. పిలుద్దామంటే మోహన్ కనుపించడంలేదు.

వేణూ కొన్ని క్షణాలు అచేతనంగావుండిపోయి, తానున్న స్థితి గుర్తుకు వచ్చి వెంటనే తేరుకుని గబగబా తడబడే అడుగులతో, చెదరిన గుండెలతో బయటకు వచ్చేసింది.

గదిలో మాటలతోబాటు నవ్వులుకూడా ఆగిపోయాయి. 'మీ బావగారట కదూ! వేణూ, తెల్లవారుఝామున వచ్చారు... నువ్వు మంచి నిద్రలో వున్నావు. లేచే వేళయిందికదా నిన్ను డిస్టర్బ్ చెయ్యడం ఎందుకని లేపలేదు' అంటూ నవ్వి 'ఏం వేణూ! కనీసం నీకొక బావగారున్నారన్న విషయం కూడా నాతో ఎప్పుడూ చెప్పేవు కావేం? పాపం ఆయన్ని గుమ్మంలోనే నిలేసి క్రాస్ ఎగ్జామినేషన్ చేశాను ఎవరో తెలీక' అన్నాడు అప్పుడే బాత్‌రూం నుండి వచ్చిన మోహన్...

వేణూ హృదయంలో భయమూ, విభ్రాంతీ ఒక్కసారే కలిగాయి. శ్రీధర్ వచ్చాడని తెలియగానే భయమూ, నవ్వుతూ గదినుండి బయటకు వస్తున్న శ్రీధర్ వెనుకనేవున్న యువతిని చూసి విభ్రాంతీ కలిగాయి. ప్రయాణం బడలికవలన కాబోలు అలసిపోయినట్లున్నారిద్దరూ.

చిత్రంగా సినిమా చూస్తున్న దానిలా నిలబడిపోయింది వేణూ...

'నేనే వేణూ! చిత్రంగా చూస్తున్నావే. నేనీ ప్రాంతానికి చాలా వచ్చి రోజులయింది గదూ! నీ వివాహం సంగతి తెలిసినా అడ్రసు సరిగా తెలిసిందికాదు' అంటూ నవ్వి, 'ఇంతకీ నేనేదో రాగానే శుభవార్త చెబుదామని వస్తే హాయిగా నిద్రపోయి ఆహ్వానించలేకపోయావు... మొత్తానికి తెలిసేయినదానివేలే గాని ఇదిగో ఈమె నీకు చెల్లెలవుతుంది. పేరు రమ' అన్నాడు పరిచయం చేస్తూ.

శ్రీధర్ ప్రక్కనే నిలబడివున్న రమ 'నమస్తే' అంది చిరునవ్వునవ్వుతూ. సంభ్రమాశ్చర్యాలనుండి తేరుకొని, వేణూ ప్రతి నమస్కారం చేసి, నిరాభారమయిన హృదయంతో మనసులోని మబ్బులు విడిపోగా గబగబా వంటింట్లోకి దారి తీసింది. కాఫీ కోసం స్టవ్ వెలిగించే ప్రయత్నంలో...

రెండు రోజులుగా మేఘాచ్ఛాదితమైవున్న ఆకాశంలో కారుమబ్బులు విడిపోయి, దూది పింజాల్లా గాలిలో తేలిపోతూ, అప్పుడే ఉదయిస్తున్న బాలభానునకు స్వాగతం పలుకుతున్నట్లున్నాయి. ◉

